ధూపదీప నైవేద్యాలేవీ?



తాడిమర్రిలోని ఆలయం



ఆలయ ప్రాంగణంలో అపరిశుభ్రత



తాడిమర్రిలోని వీరభద్రయ్యస్వామి మూలవిరాట్

- శివయ్యకు పూజలు కరువు
- ఆలయ అభివృద్ధిపై అంతులేని నిర్లక్ష్యం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

తాడిమర్రి: మండల కేంద్రం తాడిమర్రిలోని పురాతన వీరభద్రయ్యస్వామి (శివాలయం) ఆలయానికి మాన్యం భూములు ఉన్నా.. అభివృద్ధికి నోచుకోలేదు. ధూపదీప నైవేద్యాలు కూడా కరువయ్యాయి. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పక్కన ఉన్న పురాతన వీరభద్రయ్యస్వామి గుడికి ఎంతో చరిత్ర ఉంది. ఆలయ ఆలన, పాలన కోసం అప్పట్లో మాన్యం భూములు కేటాయించారు. సర్వే నంబర్ 140లో 19 ఎకరాలు, 189లో 14.32 ఎకరాలు, 238లో 13.26 ఎకరాలు, 275లో 1.62 ఎకరాలు మొత్తం 48 ఎకరాల భూమి ఉంది. ఆ భూమిని కౌలుకు ఇవ్వగా వచ్చే ఆదాయంతో ఆలయం అభివృద్ధికి వినియోగించవచ్చు. ఒక పూజారిని నియమించి ఆలయంలో నిత్య పూజలు చేయించాల్సి ఉంది. ఆలయానికి మాన్యం భూములు ఉన్నందున దేవదయ శాఖ పరిధిలోకి తీసుకొచ్చారు. అయినా ఎండోమెంట్ అధికారులు, ప్రజాప్రతినిధులు ఆలయ నిర్వహణ గురించి ఏనాడూ పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

కౌలు మొత్తం ఎక్కడికెళ్తోందో..?

వీరభద్రస్వామి ఆలయానికి 48 ఎకరాల మాన్యం ఉంది. ఈ భూములను ఎవరికి కౌలుకు ఇచ్చారు.. ఏటా కౌలు ద్వారా వస్తున్న ఆదాయం ఎంత.. ఆ డబ్బు ఎవరికి వెళ్తోంది.. ఆదాయ వ్యయాల గురించి ఎవరికీ తెలియడం లేదు. ఆలయ అభివృద్ధిని ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో అధ్వానంగా మారింది. ఆలయ ప్రాంగణంలో ఓ పక్క అయ్యప్ప స్వామి ఆలయం కూడా ఉంది. అయ్యప్పస్వామి మాలధారులు, శివమాల ధారులు చందాలు వేసుకుని అయ్యప్పాస్వామి ఆలయానికి రెండు వైపుల ప్రహరీ నిర్మించారు. వీరభద్రయ్యస్వామి గుడికి తూర్పు, దక్షిణ దిక్కుల్లో ప్రహరీ లేదు. దీంతో ఆలయ ఆవరణలోకి పశువులు, కుక్కలు వస్తుండడంతో అపరిశుభ్రత నెలకొంది.

ఆలయ అభివృద్ధిపై దృష్టిపెట్టాలి



పురాతన వీరభద్రయ్యస్వామి గుడి అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతి నిధులు కృషి చేయాలి. ఆలయంలో పూజారి లేకపోవడంతో స్వామివారికి ధూప, దీప, నైవేద్యాలు కరువయ్యాయి. ఆలయానికి మాన్యం భూములు ఉన్నాయంటున్నారు. వాటిని కౌలుకు ఇచ్చిన ఆదాయంతో ఆలయాన్ని అభివృద్ధి చేసే అవకాశం ఉంది. దానిపై దృష్టి సారించాలి.

–సాకే చిన్న పెద్దన్న, తాడిమర్రి

పూజారిని నియమించాలి

ఎంతో పురాతన శివాలయంలో పూజారి లేరు. దీంతో ఇక్కడ పూజలు కరువయ్యాయి. పూజలు చేసే అవకాశం లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆలయం ఎదుటే మా ఇల్లు ఉంది. ఆలయ దుస్థితిని చూడలేక వీలైనప్పుడల్లా దీపం వెలిగించి పూజలు చేస్తున్నాం. అధికారులు స్పందించి పూజారిని నియమించడంతో పాటు ఆలయానికి తూర్పు, దక్షిణ వైపు ప్రహరీ నిర్మించాలి. ఆలయ అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలి. భక్తులకు సౌకర్యాలు మెరుగుపరచాలి.

– రామకృష్ణయ్య, తాడిమర్రి

క్లుప్తంగా

వేతనాలు మంజూరు చేయండి



ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

గాండ్లపెంట: వేతనాలు మంజూరు చేయాలని పంచాయతీ పారిశుధ్య కార్మికులు డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ జిల్లా కోశాధికారి సాంబశివ ఆధ్వర్యంలో ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ వేతనాలు సకాలంలో ఇవ్వకపోవడంతో కుటుంబ పోషణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. మండల కేంద్రంతో పాటు పలు పంచాయతీల పరిధిలో 15 నెలల నుంచి 30 నెలల వేతనాలు అందలేదన్నారు. వేతనాలు వచ్చినా రాకున్నా పనులు చేయాల్సిందేనని పంచాయతీ కార్యదర్శులు హుకుం జారీ చేస్తున్నారన్నారు. చేసిన పనులకు జీతం ఇవ్వకపోతే ఎలా అని ప్రశ్నించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు ముస్తాక్, పారిశుధ్య కార్మికులు అంజినప్ప, గంగులప్ప, నరసింహులు, అంజి, అనిల్, లక్ష్మీదేవి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ సెల్ నేత మృతి



సత్యనారాయణ మృతదేహానికి నివాళులర్పిస్తున్న తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి

తాడిమర్రి: పిన్నదరి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ నాయకుడు సాకే సత్యనారాయణ (సత్తి) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. సమాచారం అందుకున్న డీసీఎంఎస్ మాజీ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్ రెడ్డి పిన్నదరికి వెళ్లి సత్యనారాయణ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుని భార్య జ్యోతిని పరామర్శించారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని అధైర్య పడవద్దని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు పొరాళ్ల విజయ భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ సాకే ఆదెప్ప, మాజీ సర్పంచ్ సదానంద, నాయకులు ఆనందరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, శీనప్ప తదితరులు పాల్గొన్నారు.

బొమ్మల తయారీపై శిక్షణ



మెలకువలు నేర్పుతున్న గ్రంథాలయ అధికారి, ఉపాధ్యాయురాలు

ధర్మవరం అర్బన్: వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు సోమవారం స్పోకెన్ ఇంగ్లిష్‌తో పాటు బొమ్మల తయారీపై ఉపాధ్యాయురాలు వెన్నెల శిక్షణ ఇచ్చినట్లు పట్టణంలోని జగ్జీవన్ రామ్‌నగర్‌లోని గ్రంథాలయం అధికారి అంజలీ సౌభాగ్యవతి తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది రమణనాయక్, సత్యనారాయణ, శివమ్మ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సూర్య ఘర్‌పై నేడు అవగాహన

పుట్టపర్తి టౌన్: పట్టణంలోని సాయి ఆరామంలో మంగళవారం ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజనపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఓ శివరాములు తెలిపారు. విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్, ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డితో పాటు ప్రజా సంఘాల ప్రతినిధులు, స్వయంసహాయక సంఘాల సభ్యులు పాల్గొంటారని పేర్కొన్నారు.

22న హనుమాన్ శోభాయాత్ర



కరపత్రాలు విడుదల చేస్తున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు

ధర్మవరం అర్బన్: ఈ నెల 22న ధర్మవరంలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించనున్నారు. శోభాయాత్ర కరపత్రాలను సోమవారం ధర్మవరంలోని విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ విభాగ్ కార్యదర్శి పులిచెర్ల వేణుగోపాల్ మాట్లాడుతూ హిందూ ధార్మిక సంస్థలు, కుల సంఘాలు, దేవాలయ కమిటీలు, భజన సంఘాలు, హిందూ బంధువులు అందరూ శోభాయాత్రలో పాల్గొని జయప్రదం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పోలిశెట్టి వెంగముని, జిల్లా భజరంగ్ దళ్ సంయోజక్ మురళీమోహన్‌రెడ్డి, ప్రఖండ కార్యదర్శి దేవరకొండ రామానుజులు, ఆర్ఎస్ఎస్ ఖండ ఉపాధ్యాయ ప్రముఖ్ అన్నం అరవింద్, బండ్లపల్లి నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తున్న ఎంపీ పార్థసారథి, ఉద్యోగ సంఘం నాయకులు

పుట్టపర్తి టౌన్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకుని మంచిపేరు తీసుకురావాలని ఎంపీ బీకే పార్థసారథి, రిటైర్డు జడ్జి కిష్టప్ప సూచించారు. సోమవారం పుట్టపర్తి సాయి ఆరామంలో కురుబ ఉద్యోగ, ఉపాధ్యాయ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో కనకదాస ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ఎంపీ, రిటైర్డు జడ్జి ముఖ్య అతిథులుగా హాజరై పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిన కురుబ విద్యార్థులను శాలువాతో సన్మానించి మొమెంటోలు, నగదు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదవుతో పాటు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ఎదగాలని ఆకాంక్షించారు. చదవును ఒడిసి పట్టి మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ చదువు ఆపకూడదన్నారు. చెడు వ్యసనాలకు బానిస కాకుండా తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి మంచిపేరు తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో ఎన్జీఓ సంఘం అధ్యక్షుడు నాగార్జున, ఎంపీడీఓ నరేష్, డైట్ పీడీ రామకృష్ణ, కురుబ ఉద్యోగ, ఉపాధ్యాయ సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు నాగేంద్ర, ప్రధానకార్యదర్శి నాగభూషణ, పీడీ వెంకటేష్, రామకృష్ణ, సుధాకర్, నాగార్జున, శ్రీనివాసులు, సామకోటి ఆదినారాయణ, మరారి తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య ఆశయాలు కొనసాగిద్దాం



కదిరి సీపీఎం కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి నిర్వహిస్తున్న నేతలు



ధర్మవరంలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

తనకల్లు: కమ్యూనిస్టు నేత పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలు కొనసాగిద్దామని నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని బీఆర్ అంబేడ్కర్ సర్కిల్‌లో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం మండల కార్యదర్శి శివన్న మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతి కోసం పుచ్చలపల్లి సుందరయ్య సుందరయ్య చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రమణ, సీఐటీయూ ఒంటెద్దు వేమన్న, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం: పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో సోమవారం పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి వేడుకలను కమ్యూనిస్టు నాయకులు ఘనంగా నిర్వహించారు. రైతు సంఘం నాయకులు జంగాలపల్లి పెద్దన్న, సీపీఎం నాయకులు ఎస్‌హెచ్ బాషా, మారుతి, జేవీ రమణ, అయూబ్‌ఖాన్, ఆదినారాయణ, వెంకటస్వామి, నారాయణస్వామి, నాగవేణి తదితరులు పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కదిరి టౌన్: పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి వేడుకలను కదిరి సీపీఎం కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. సీపీఎం పట్టణ అధ్యక్షుడు జీఎల్ నరసింహులు మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య జీవితం నేటి తరానికి ఆదర్శమన్నారు. కార్యక్రమంలో నాయకులు బాబ్జాన్, రామ్మోహన్, శివ, శాంతిబాయి, లక్ష్మీబాయి, సుధాకర్‌రెడ్డి, రఫి, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

ఓడీచెరువు : ఓడీచెరువు మండల కేంద్రంలో సీపీఎం నాయకులు కమ్యూనిస్టు నేత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి నిర్వహించారు. సీనియర్ నాయకులు వి.వి. రమణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సుందరయ్య ఆశయాలను కొనసాగించాలని, ఆయన చూపిన బాటలో నడవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కన్వీనర్ కుళ్లాయప్ప, అంజి, బాషా, నాగేంద్ర, మురళి తదితరులు పాల్గొన్నారు

నాటుసారా నిర్మూలనపై ప్రత్యేక దృష్టి



సూచనలిస్తున్న ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

చెన్నేకొత్తపల్లి: గ్రామాల్లో నాటుసారా నిర్మూలపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య ఎక్సైజ్ పోలీసు సిబ్బందిని ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రొహిబిషన్, ఎక్సైజ్ సర్కిల్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించిన అనంతరం మాట్లాడారు. నవోదయం 2.0 కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని తెలిపారు. గతంలో గ్రామాల్లో నాటుసారాను తయారు చేసే పాత నేరస్తులపై నిఘా ఉంచాలని ఆదేశించారు. కర్ణాటక మద్యం అక్రమ రవాణా, విక్రయంపై నిఘా పెట్టాలని సూచించారు. బెల్టుషాపులు లేకుండా చూడాలన్నారు. లైసెన్స్ మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ ధర కన్నా ఎక్కువ విక్రయిస్తే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సీఐ ఫరూక్ ఆజామ్, ఎస్ఐ శివప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

రైలు ఢీకొని కూలీ మృతి

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని ప్యాదిండి సమీపంలో సోమవారం రాత్రి రైలు ఢీకొని ముఖేషసింగ్ (25) అనే కూలీ మృతి చెందాడు. హిందూపురం రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మురళీ తెలిపిన వివరాలు.. మధ్యప్రదేశ్‌కు చెందిన ముఖేష్‌సింగ్ మండల పరిధిలోని ప్యాదిండి వద్ద జరుగుతున్న రైల్వే పనులకు కూలీగా వచ్చాడు. సోమవారం పగలంతా పనులు చేసిన అనంతరం రాత్రి రైల్వే ట్రాక్ దాటుతుండగా ప్రమాదవశాత్తూ రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయాన్ని మృతుడి తండ్రి శ్యాం బహదూర్‌సింగ్‌కు ఫోన్ ద్వారా సమాచారం చేరవేసినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. హిందూపురం రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యూవల్ చేయాలి



డీటీకి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

నల్లమాడ: ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యూవల్ చేయాలని మూలప్పగారిపల్లి, గోపేపల్లి తండా, పులగంపల్లి గ్రామాలకు చెందిన ఆర్డీటీ సంఘాల లీడర్లు సోమవారం డిప్యూటీ తహసీల్దార్ మనోజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. పేదలకు విద్య, వ్యవసాయం, వైద్యం తదితర రంగాల్లో అండదండలుగా ఉన్న ఆర్డీటీని కాపాడాలని కోరారు.

అధికారులపై ఫిర్యాదు

ఓడీచెరువు : ప్రజా సమస్యల పరిష్కార వేదికకు గైర్హాజరైన అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తహసీల్దార్ అనంతాచారి తెలిపారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు 9 శాఖల అధికారులు హాజరుకాగా, 11 శాఖల అధికారులు గైర్హాజరయ్యారని పేర్కొన్నారు.

ఎన్ఎస్ గేట్‌లో పోలీసు బందోబస్తు



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

చెన్నేకొత్తపల్లి: రామగిరి ఎంపీపీ ఎన్నిక సందర్భంగా సోమవారం ఎన్ఎస్ గేట్‌లో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా రామగిరి వైపునకు వెళ్లే దారిలో ఉదయం తొమ్మిది గంటల నుంచే అటువైపు వెళ్లే వాహనాలను తనిఖీలు చేసి పంపారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పోలీసులు ఎన్ఎస్ గేట్‌లో బందోబస్తు కొనసాగించారు.

గ్రామీణ రహదారులను బాగు చేస్తాం



బాలేపాళ్యం-నెమలివరం రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

కనగానపల్లి: గ్రామీణ ప్రజల రవాణా సౌకర్యాలను మెరుగుపరిచేందుకు రహదారులను బాగు చేస్తామని ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. మండలంలోని బాలేపాళ్యం-నెమలివరం గ్రామాల మధ్య వేసిన 3 కి.మీ. తారురోడ్డును సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.2 కోట్ల నిధులతో తారు రోడ్డును నిర్మించినట్లు పేర్కొన్నారు. గ్రామీణ రోడ్లు చాలా దెబ్బతిన్నాయన్నారు. వాటిని బాగుచేసి ప్రజల రవాణా సౌకర్యాలను మెరుగుపరుస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్‌శాఖ డీఈ లక్ష్మీనారాయణ, డీసీఎంఎస్ చైర్మన్ నెట్టం వెంకటేష్, మార్కెట్ యార్డు చైర్మన్ సుధాకర్ నాయుడు, తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీఓ అనిల్ కుమార్, మాజీ జెడ్పీటీసీ బిల్లే ఈశ్వరయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సోమందేపల్లిలో చోరీ

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని ద్వారకామయినగర్‌లో ఆదివారం రాత్రి ఓ ఇంట్లో చోరీ జరిగింది. స్థానికుల వివరాలమేరకు.. స్థానికంగా నివాసముంటున్న అతిక్.. కుటుంబ సభ్యులతో కలిసి రెండు రోజుల క్రితం స్వగ్రామమైన బ్రహ్మపల్లికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని గుర్తించిన దుండగులు తాళాలు పగలగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. బీరువాలో ఉన్న ఒకటిన్నర తులం విలువైన నాలుగు బంగారు ఉంగరాలతో పాటు వెండి చెవి కమ్మలు, కాలు పట్టీలు, రూ.4 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు అతిక్ ఆవేదన వ్యక్తం చేశారు. క్లూస్ టీమ్ సభ్యులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

'పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ ఆపండి'

ఎన్పీ కుంట(గాండ్లపెంట): రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ఆసంబద్ధాలతో అశాస్త్రీయంగా ఉందని, తక్షణం ఆపాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రాథమిక విద్యా వ్యవస్థకు పెను సవాల్‌గా మారిన 117 జీఓ రద్దు చేసి మెరుగైన విద్యా వ్యవస్థను తీసుకొస్తామని చెప్పిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చిన తర్వాత తొమ్మిది రకాల పాఠశాలలతో అడ్డగోలుగా విభజించి పాఠశాల వ్యవస్థను నిర్వీర్యం చేశారని విమర్శించారు. మోడల్ ప్రైమరీ పాఠశాలల ఏర్పాటును స్వాగతిస్తున్నామని, వాటి పేరుతో ఒకటి, రెండు తరగతులతో కూడిన ఫౌండేషన్ పాఠశాలలను, ప్రాథమిక తరగతులను ఉన్నత పాఠశాలలకు తరలించే కేంద్రీకృత విద్యా విధానాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఉద్యోగ సంఘాల, మేధావుల సూచనలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్ష నిర్ణయాలతో పల్లెబిడులను ప్రశ్నార్థకం చేస్తున్న విద్యా విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు.

మట్టి అక్రమ తవ్వకాలపై ఫిర్యాదు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఓడీచెరువు: గ్రీన్ ఫీల్డ్ హైవే కాంట్రాక్టర్ అక్రమంగా మట్టి తవ్వకాలు చేస్తున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు వీరాంజనేయులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. నాయనకోట ప్రాంతంలో అనుమతి తీసుకున్న ప్రాంతంలో కాకుండా.. మరొక చోట పచ్చని చెట్లు, అటవీ ప్రాంతం పరిధిలో మట్టి తవ్వకాలు చేపడుతున్నారని ఆరోపించారు. పర్యావరణానికి ముప్పు వాటిల్లే విధంగా మట్టి తవ్వకాలు చేస్తున్నారన్నారు. సమగ్ర విచారణ చేపట్టి అక్రమంగా చేపడుతున్న మట్టి తవ్వకాలను అరికట్టాలని తహసీల్దార్ అనంతాచారిని కోరారు.

కమాండ్ కంట్రోల్ కేంద్రాల ఏర్పాటు

ధర్మవరం అర్బన్: జిల్లాలో ఉరుములు, పిడుగులతో కూడిన వర్షాలు పడే సూచనలు ఉండటంతో ధర్మవరం ఆర్డీఓ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాల్లో కమాండ్ కంట్రోల్ కేంద్రాలను ఏర్పాటు చేశామని ఆర్డీఓ మహేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాల దృష్ట్యా డివిజన్‌లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తహసీల్దార్ కార్యాలయపు కమాండ్ కంట్రోల్ వారిని సంప్రదించాలని, ప్రజలందరూ తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఆర్డీఓ కార్యాలయంలో 98660 57959, ధర్మవరం తహసీల్దార్ కార్యాలయం 95539 29724, బత్తలపల్లి తహసీల్దార్ కార్యాలయం 74165 97120, తాడిమర్రి తహసీల్దార్ కార్యాలయం 93911 64803, ముదిగుబ్బ తహసీల్దార్ కార్యాలయం, 63012 79595, చెన్నేకొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయం 79817 34346, కనగానపల్లి తహసీల్దార్ కార్యాలయం 85558 28121, రామగిరి తహసీల్దార్ కార్యాలయం 85003 38330 నంబర్లలో ప్రజలు సంప్రదించాలన్నారు.

ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటుకు భూమి పూజ



భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి అర్బన్: ముత్యాలచెరువు సమీపంలోని ఏపీఐఐసీ స్థలంలో సోమవారం మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజస్ (ఎంఎస్ఎంఈ) పార్కు ఏర్పాటుకు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ భూమిపూజ నిర్వహించారు. మొత్తం 93 ఎకరాలకు గాను ప్రస్తుతం తొలిదశలో 20 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కు అభివృద్ధి చేయనున్నట్లు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎస్ఎస్ సోనీ తెలిపారు. ఇక్కడ రోడ్లు, డ్రెయినేజీ, విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వీవీఎస్ శర్మ, తహసీల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీఓ పోలప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ ఏపీఓగా సుధాకర్

ధర్మవరం రూరల్: ఉపాధి హామీ పథకం ధర్మవరం మండల ఏపీఓగా సుధాకర్ బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ఇక్కడ పని చేస్తున్న ఏపీఓ అనిల్‌కుమార్ రెడ్డి బదిలీపై తాడిమర్రికి వెళ్లారు. ఆయన స్థానంలో ఓడీసీ మండలంలో పనిచేస్తున్న సుధాకర్ బదిలీపై ఇక్కడికి వచ్చారు.

ఉద్యాన తోటల సాగుకు గ్రీన్ సిగ్నల్

- ఉపాధి హామీ ద్వారా వంద శాతం సబ్సిడీ
- ఎస్సీ, ఎస్టీ, సన్న, చిన్నకారు రైతులకు అవకాశం



ఉపాధి హామీ కింద సాగు చేసిన చీనీ మొక్కలు

ధర్మవరం రూరల్: ఉపాధి హామీ పథకం కింద విరివిగా ఉద్యాన తోటలు సాగు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇటీవల వర్షాలు కురుస్తుండడంతో మొక్కలు నాటేందుకు చక్కటి అవకాశం ఏర్పడింది. అందులో భాగంగా ఉద్యాన తోటలు సాగు చేసుకునే రైతుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించి అర్హత కలిగిన రైతులను ఎంపిక చేయడానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. పండ్ల తోటలను అభివృద్ధి చేసుకుంటే కరువును తరిమికొట్టడమే కాకుండా రైతులు ఆర్థికంగా బలపడే అవకాశం ఉంది. గత ప్రభుత్వంలో పండ్ల తోటల అభివృద్ధికి విశేషంగా ప్రోత్సాహకాలు అందించారు. ఫలితంగా గడిచిన ఐదేళ్ల కాలంలో ధర్మవరం వ్యవసాయ డివిజన్‌లో 12,400 హెక్టార్లలో వివిధ రకాలు పండ్ల తోటలను రైతులు సాగు చేసుకొని వాటిపైనే జీవనాధారం సాగిస్తున్నారు. అలాగే ఈ ఏడాది (2025–26)కి గాను ధర్మవరం మండలంలో 220 ఎకరాల్లో పండ్ల తోటలు సాగు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఐదు ఎకరాల లోపు భూములున్న ఎస్సీ, ఎస్టీ రైతులతో పాటు సన్న, చిన్న కారు రైతులు కూడా అర్హులే. ఉపాధి హామీ పథకం జాబ్ కార్డ్‌తో పాటు భూమి పట్టాదారు పాసుపుస్తకం కలిగి ఉంటే మామిడి, చీనీ, నిమ్మ, జామ, కొబ్బరి, సీతాఫలం, చింత, రేగు, నేరేడు, డ్రాగన్ ఫ్రూట్‌తో పాటు గులాబీ, మల్లె తోటల సాగుకు వంద శాతం సబ్సిడీ లభిస్తుంది.

ప్రోత్సాహకాలిలా..

ఉపాధి హామీ పథకం కింద మూడేళ్లకు కలిపి విడతల వారీగా మొత్తం మామిడికి ఎకరాకు రూ.1,03,193, చీనీ రూ.1,07,459, నిమ్మ రూ.1,41,515, జామ రూ.1,27,451, సీతాఫలం రూ.59,217, దానిమ్మ రూ.2,44,819, గులాబీ రూ.50,720, మల్లె రూ.44,568, నేరేడు రూ.41,292, చింత రూ.66,500, రేగు రూ.1,08,338, డ్రాగన్ ఫ్రూట్ రూ.1,84,533, కొబ్బరి తోట రూ, 90,610 చొప్పున రైతులకు ప్రోత్సాహకాలు అందజేస్తారు.